www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025
5



యుటిఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మామిడికుదురు



ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

గుంటూరులో ఈ నెల 25న నిర్వహించబోయే రణభేరి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మామిడికుదురులో శనివారం మండల యుటిఎఫ్ శాఖ ఆవిష్కరించింది . ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి సిహెచ్.శేషవరావు మాట్లాడుతూ ఆర్థిక, ఆర్థికేతర అంశాల సాధనకై నిర్వహిస్తున్న పోరాట కార్యక్రమానికి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 10వేల మందితో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి. నాగేంద్రప్రసాద్, సాయిబాబు, కపిల్, అరుణ జ్యోతి, వరలక్ష్మి ,శ్యామలా వతి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో మేజర్ డ్రెయినేజీ

- డ్రెయినేజీపై విరుద్ధ కట్టడాలతో పారని మురుగు, చెత్త!
- వర్షం పడితే ముప్పేట ముంచుతున్న ముంపు
- ఆక్రమణలను అదుపు చేయడంలో అధికారుల విఫలం

ప్రజాశక్తి - రాజోలు

నియోజకవర్గ కేంద్రం రాజోలుకి సక్రమమైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదు.మురుగు పారేందుకు ఉన్న ఒక్క డ్రెయినేజీ ఆక్రమణలకు గురై బక్క చిక్కి పోయింది. విరుద్ధ కట్టడాలతో మురుగు, చెత్త వెళ్లే వీలు లేక అధ్వానంగా మారింది. రాజోలు నియోజకవర్గ కేంద్రం రాజోలు గ్రామానికి ప్రధానమైన మురికి కాలువ సోంపల్లి మేజర్ డ్రెయినేజీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయ్యింది. కొందరి అక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. మురుగు నీరు ముందుకు పారక రాజోలు గ్రామంలో ఉన్న ప్రజలు, వేలాది ఎకరాల వరిసాగు చేస్తున్న రైతులు ముంపు బారిన పడుతున్నారు. మురుగు బయటకు పారేందుకు వీలుగా డ్రెయినేజీ లేకపోవడంతో మేజర్ డ్రెయినేజీ.. పరిస్థితి మేజర్ సమస్యగా మారింది. రాజోలు ప్రభుత్వ కాలేజీ పరిసరాల నుంచి ప్రారంభమై.. రాజోలు చేతి పర వరకు డ్రెయినేజీ ఉంది. ప్రస్తుతం దాని విస్తీర్ణం, వెడల్పు వంటివి పరిశీలిస్తే.. మొత్తం డ్రెయినేజీ ఆక్రమణలలో ఉందని అందరికీ ఇట్టే అవగతం అవుతుంది.

ముంపు ముప్పేట దాడి!

నీరు పారే వీలులేక కొద్దిపాటి వర్షానికే రాజోలు ముంపునకు గురౌతుంది. చిన్నపాటి చినుకులకే కాలనీలన్నీ జలమయం అవుతున్నాయి. రహదారులపై నీరు నిల్వ ఉండిపోయి పాడైపోతున్నాయి. పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతోన్నాయి. నియోజకవర్గ ముఖ్యకేంద్రం రాజోలులో ఉన్న ఈ మేజర్ డ్రెయినేజీ ప్రధాన సమస్యపై నూతనంగా ఎన్నికైన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ దృష్టి సారించి.. ఏళ్ల తరబడి ఉన్న నాటి సమస్యకు పారిష్కరం చూపాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలతో.. ఆటంకం

మురుగు నీరు పారేందుకు వీలు లేకుండా ఎవరి నివాసాల ఎదుట వారు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వంతెనలు, సిమెంట్ బ్రిడ్జిలు, సిమెంటు తూములు ఏర్పాటు చేసుకోవడం తో మురుగు నీరు ఎటూ పారక మొత్తం డ్రెయినేజీ దారుణంగా పరిణమించింది. డ్రెయినేజీని ఆనుకుని ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి బలమైన కట్టడాలు మరుగు నీటి పారుదల కు ఆటంకంగా మారాయి. పలుసార్లు సర్వే పేరుతో అధికారులు ఆక్రమార్కులకు ముచ్చెమటలు పట్టించకపోగా.. సర్వే కొలతల్లో తలలు పట్టుకుంటున్నారు. దీంతో రాజకీయ అండదండలతో మేజర్ డ్రెయినేజీ అంటే సుమారు 4 మీటర్ల వెడల్పు ఉండాలి. అయితే డ్రెయినేజీపై వంతెనలు, కాలి బాటలు, ప్రహరీల నిర్మాణంతో 1 మీటరు వెడల్పుతో ఉంది. ఉదాహరణకు కొన్ని భవనాల ఎదుట డ్రెయినేజీకి స్లాబ్లు కూడా వేసేశారు.

వర్షం పడితే చేల్లో మురుగే!

రాజోలులో కొద్దిపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురౌతూ నీట మునుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మేజర్ డ్రెయినేజీ ఆక్రమణలకు గురవ్వడమే ప్రధాన కారణం. అలాగే ఈ డ్రెయినేజీకీ ఆనుకుని ఉన్న వందలాది ఎకరాల వరిచేలలో ముంపు నీరు దిగక పంట పొలాలు నాశనం అవుతున్నాయి. రాజోలు మండలంలో పంచాయతీ పరిధిలో ఉన్న అన్నిచిన్న మురుగు కాలువలు అన్ని ప్రధాన మేజర్ డ్రెయినేజీకీ అనుసంధానమై ఉంటాయి. దీంతో వర్షాకాలంలో వర్షాలకు డ్రెయినేజీలు అన్నీ నీట మునగడంతో మేజర్ డ్రెయినేజీలో మురుగు పారకపోవడం వల్ల గ్రామం మొత్తం ముంపునకు గురౌతుంది. దీంతో కాలనీలు అన్ని అపారిశుధ్యంతో దోమలకు నిల యాలు గా మారుతున్నాయి. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మొత్తం డ్రెయినేజీ స్థలమే!

ఆధునికీకరణలో భాగంగా నిర్వహించిన సర్వేలో సంబంధింత అధికారులు తలలు పట్టుకుం టున్నారు. దీనికి ప్రధాన కారణం డ్రెయినేజీకి ఆనుకుని ఉన్న రహదారి చుట్టుపక్కల నిర్మించిన భవనాల సైతం సంబంధిత డిపార్ట్‌మెంట్ స్థలంలోకి ఉండటంతో అధికారులకు ఏమీ తోచడం లేదు. ఏ నిర్మాణం తొలగిస్తే ఏ సమస్య ఎదురౌతుందోనని అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోను ఈ డ్రెయినేజీ ఆధునికీకరణకు నిధులు మంజూరు అయినప్పటికీ గుత్తేదారులు ముందుకు రాకపోవడం తో ఆ నిధులు మరలా వెనక్కి మరిలాయి దీంతో డ్రెయినేజీ నిర్మాణం కలగా మిగిలింది. ఆక్రమణలు తొలగించి పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేస్తేనే ముంపు సమస్యకు పరిష్కారమవుతుందనిప్రజలు వేచి చూస్తున్నారు. దీనిపై ప్రస్తుత ఎంఎల్ఎ చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



ఆక్రమణలకు గురైన రాజోలు మేజర్ డ్రెయినేజీ (ఇన్‌సెట్)లో మురుగుపారక అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ



రాజోలులో ఒక భవనం ముందు కానరాని డ్రెయినేజీ

ఆక్రమణలపై దృష్టి సారిస్తాం



పరిసరాలను చక్కదిద్ది.. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్యం కాపాడట మే ప్రభుత్వ లక్ష్యం. డ్రెయి నేజీలను ఎప్పటికప్పుడు పూడిక తీయించి కాలనీలను చక్కదిద్దే కార్యక్రమాలు చేపట్టాం. అందుకు ముందుగా డ్రెయినేజీల సర్వే చేయిస్తాం. ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ ఆధునికీకరణ చేపట్టి పరిస్థితి చక్కదిద్దుతాం.

–దేవ వరప్రసాద్, ఎంఎల్ఎ, రాజోలు

ఆక్వా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆక్వా, నాన్ ఆక్వా జోన్లు, ఫ్రెష్‌వాటర్, ఉప్పునీటి చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మత్స్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు మత్స్య శాఖ సచివాలయ సహాయకులతో సమావేశం నిర్వహించి ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 48,387 ఎకరాల విస్తీర్ణంలో చెరువులో ఉన్నాయన్నారు. ఆక్వాజోన్ చెరువుల రిజిస్ట్రేషన్ రైతు వివ రాలు, చెరువు విస్తీర్ణం సర్వే నెంబరు, భూస్వామ్య వివరాలు, వయస్సు, ఆధార్, మొబైల్ నంబర్ వంటి వివరాలు సహా ప్రత్యేకమైన అప్లికేషన్ ఫారం తయారు చేయాలన్నారు. గ్రామ, మండల, స్థాయి కమి టీల తో సభలు నిర్వహించి అక్వాజోన్ భూములకు రిజిస్ట్రేషన్ల కొరకు అభ్యంతరాలపై అభిప్రా యాల ను సేకరించాలన్నారు. వివరాలను మత్స్యశాఖ పోర్టల్ ద్వారా, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ ద్వారా రిజిష్టర్ చేయాలన్నారు ఫ్రెష్ వాటర్ చెరువులకు సంబంధించి నోటీసులు జారీ చేస్తూ పంచాయతీ నందు ఐదు రోజులు గడువును ప్రకటించి ఈ నెల 27వ తేదీ నాటికి ఆక్వా జోన్లోనూ, తదుపరి నాన్ ఆక్వాజోన్లో కూడా చెరువులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. బ్యాకీస్ వాటర్ సంబంధించి దరఖా స్తులన్నీ 24వ తేదీ నుండి సంబంధిత పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించ వలసినదిగా ఆదేశించారు. మత్స్య శాఖ వారి సమన్వయంతో రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు సంబంధిత సిబ్బంది కూడా ఈ ప్రక్రియ కు పూర్తిగా సహకరించాలని సూచించారు ఈ నెలాఖరు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు పీవీ.శ్రీనివాసరావు, వర్ధన్, ఎఫ్‌డిఒలు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

కనీసవేతనం పెంచాలని, నామినీ విఆర్‌ఎలకు ఉద్యోగాలు కల్పించాలని, అర్హులైన వారికి నైట్ వాచ్మెన్, అటెండర్లు, గా ప్రమోషన్ లు కల్పిం చాలన్న డిమాండ్లపై రాష్ట్ర కమిటీ పిలుపు శనివారం రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద డివిజన్ స్థాయి విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్ర మం లో సంఘం జిల్లా అధ్యక్షులు దారపురెడ్డి వీరభద్రారావు మాట్లాడుతూ రాష్ట్ర రెవిన్యూ శాఖాలో 20 వేల మంది విలేజ్ రెవిన్యూ సహాయకులు ఉన్నారని, దశాబ్దాలుగా కనీస వేతనాలు లేక కేవలం రూ.పది వేల జీతంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినీలుగా నియమించాలని కోరారు. సెప్టెంబర్ 22న అమలాపురం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ విఆర్‌ఎ ఉద్యమానికి సంపూర్ణ మద్దత్తు తెలియజేశారు. వారి డిమాండ్లు న్యాయమైన వని, వీరికి కనీసవేతనం రూ.27,650 ఇవ్వాలని, ప్రమోషనలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌డిఒ అఖిలకు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం అధ్యక్షులు కొన మంచిలి ఆనంద్ కుమార్, రాయవరం అధ్యక్షులు వీర బాబు, కపిలేశ్వరపురం అధ్యక్షులు పలివెల నాగేశ్వరరావు, నాయ కులు విక్కీ, అడపా శివ ప్రసాద్, కె. ఆనంద్, విఆర్‌ఎలు పాల్గొన్నారు.



పిఎం శ్రీ పాఠశాల ల్యాబ్‌లో అధికారుల పరిశీలన

శాస్త్రీయ దృక్పథానికి సైన్స్ దోహదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు సైన్స్‌ల్యాబ్‌లు దోహదం చేస్తాయని జిల్లా సైన్స్ అధికారి జివి ఎస్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని అనాతవరం పిఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యా శాఖ ఆదేశాల మేరకు సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, అకాడమిక్ అధికారి పిల్లి రాంబాబుల బృందం సందర్శించి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరు వురు మాట్లాడుతూ సైన్స్‌ల్యాబ్ లను పాఠ్యాంశాలకు అనుసంధానించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ విజ్ఞానాన్ని వెలికి తీయ వచ్చునన్నారు. అంతే కాకుండా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలోని కార్యక్రమాలను క్యాలెండర్ ప్రకారం తప్పనిసరిగా అమలు జరిగేలా చూడాలని, సబ్జెక్టుతో సంబంధం లేకుండా ప్రతి ఉపాధ్యాయుడు ల్యాబ్ లను సమర్థవంతంగా వినియోగించు కోవాలని సూచిం చారు. అలాగే కోమానపల్లి జడ్‌పి పాఠశాలను బృందం సందర్శించింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాధ (అనాతవరం), ఉపాధ్యాయులు బాలర్జున్‌లతో పాటు విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివారుకు సాగునీరు అందించేందుకు కృషి

రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రాజెక్ట్ ఛైర్మన్ సునీల్‌కుమార్

ప్రజాశక్తి - ఆలమూరు



వృథాగా పోతున్న నీటిని పరిశీలిస్తున్న సునీల్ కుమార్

హెడ్ లాకుల అభివృద్ధితో రైతులకు పంట కాలువల ద్వారా శివారు సాగు వరకు సాగునీరు అందించేందుకు కషి చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ రాష్ట్ర ప్రాజెక్ట్ చైర్మన్ మురాల శెట్టి సునీల్ కుమార్, ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి అన్నారు. చొప్పెల్ల హెడ్ లాకులను ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివి.రామకృష్ణతో కలిసి శనివారం పరిశీలించారు. ముందుగా ఆలమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో వారికి ఘనస్వాగతం పలికి అభినందన సత్కారం నిర్వహించారు. అలాగే స్థానిక కాటన్‌విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసి అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి లాకుల పరిస్థి తిని సునీల్ కుమార్‌కివివరించారు. కనీసం నిర్వహణా ఖర్చులు కూడా చాలా ఏళ్ల నుండి ప్రభుత్వం మంజూరు చేయడం లేదని వారంతా తెలిపారు. చొప్పెల్ల హెడ్‌లాకు ద్వారా మెదటి పంటకు 1,04,934 ఎకరాలకు సాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. రెండో పంటకు 94,500 ఏకరాలకు నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే చాలా లాకులు శిథిలావస్థ స్థితిలోనే నడుస్తున్నాయని ఇరిగేషన్ శాఖ అధికారులు అన్నారు. స్పందించిన సునీల్‌కుమార్ లాకుల అభివృద్ధికి తన వంతుగా ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ కృష్ణ త్రిమూర్తులు, ఐసిఎ కె.శ్రీనివాస్, లాక్ సూపర్‌వైజర్ కె.శేఖర్, టిడిపి యువనేత మెర్ల నాగేంద్ర, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన దస్తావేజు లేఖర్ల నిరసన

ప్రజాశక్తి - రావులపాలెం



రావులపాలెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖర్ల నిరసన

2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ప్రజలకు, దస్తావేజుల లేఖర్లకు కలుగుతున్న ఇబ్బందుల దష్ట్యా దస్తావేజు లేఖర్లు శనివారం రెండో రోజు నిరసన కొనసాగించారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు తమ సమస్యలు పరిష్కరించాలని రిజిస్ట్రార్ వారికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలియజేశారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పులపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి రామ మోహన రెడ్డి, పులగుర్త రామారావు, పోతప్రగడ శ్రీరామకుమార్, యలమర్తి సుబ్బారావు, కర్రి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి అప్పారెడ్డి, పెంటపాటి రమేష్‌బాబు, కోణాల భాస్కరరెడ్డి, పెచ్చెట్టి రాజశేఖర్, కొవ్వూరి సుబ్బారెడ్డి, మాచిరాజు వెంకట సత్యసాయి, దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వము నూతనముగా ప్రవేశపెట్టిన విధానాలను నిరసిస్తూ మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి దస్తావేజు లేఖర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు జక్కంపూడి సత్యనారాయణ, కార్యదర్శి కోలా సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట ..

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మూలస్థానం అగ్రహారంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన అవగాహన కల్పించారు. 'సుపోషిత్ భారత్, సక్షం భారత్‌లపై సర్పంచ్ లంక వరప్రసాదరావు అధ్యక్షతన శనివారం ప్రతిజ్ఞతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి దేవి మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ మాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తల్లులకు, గర్భిణీల కు, బాలలకు పౌష్టికాహారం తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పోషణ పై ప్రతిజ్ఞలు వంటి అంశాలను వివవరించారు. ఇందులో భాగంగా అంగన్‌డీలు తయారు చేసిన పోషకాహార వంటలపై పోటీలతో పాటుగా బిఎంఐ ఎదుగుదల నిర్ధారణకు కొలతల శిబిరాలు ఏర్పాటు చేశారు. పలు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్.వీరమాత, గ్రేడ్ 5 కార్యదర్శి హేమంత్ కుమార్, అంగన్‌వాడీలు కుమారి, నాగమణి, ధనలక్ష్మి, కమల, జానకి భాను, తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ, నాయకులు

ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలు తప్పక గుర్తింపునిస్తాయని స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. గొల్లవిల్లి సచివాలయంలో శనివారం సర్పంచ్ శ్రీ దుర్గ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సత్కరించారు. బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి పరమట సాయి బాబు, ఎఎన్ఎం పాము రాధా సలూజ, అగ్రికల్చర్, ఇంజినీరింగ్, డిజిటల్,వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎం.రవిచంద్ర, కె.ఆనంద్, బి.శ్రావణ్‌వర్మ, జె.వీర బాబు, ఎం.ఆకాష్, మహిళా పోలీస్ ఎం.దివ్య శ్రీలను దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, మాజీ సర్పం చ్‌లు అరిగెల నానాజీ, గుత్తాల సుభాష్ చంద్ర రావు, సహకార సొసైటీ అధ్యక్షులు మంచెం బాలకృష్ణ, నీటి సంఘ అధ్యక్షులు నల్లా సత్యనారాయణ, మాజీ సొసైటీల అధ్యక్షులు గొలకోటి సత్తిరాజు, మారిశెట్టి పుండరీకాక్షుడు, జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి ఎండి షెహన్‌షా, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం



మహిళలకు టూల్ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

మహిళలు ఆర్థికంగా బలోపేతంకావాలనే లక్ష్యంతో వత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో పట్టణంలోని జూనియర్ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్‌ఎస్ఇటిఐ సౌజన్యంతో మహిళలకు 35 రోజులపాటు ఇవ్వనున్న వస్త్ర చిత్రకళా ఉద్యమి శిక్షణ కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇప్పటికే కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర వత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. అపార అనుభవం ఉన్న శిక్షకులను తీసుకొచ్చి కోర్సు అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఆర్‌ఎస్ఇటిఐ డైరెక్టర్ తాడి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం చేపడుతున్న పథకాలు, అందిస్తున్న రుణాలు విపులంగా వివరించారు. శిక్షణకు వచ్చిన మహిళలకు మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ చేతుల మీదుగా యూనిఫామ్, టూల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు కె.ఆదిలక్ష్మి, ఉమా మహేశ్వరరావు తెలిపారు. సపక్ తక్రా అండర్- 14 విభాగంలో కె.జానకి మరియు అండర్-19 టేబుల్‌టెన్నిస్ విభాగంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయి జట్టుకి ఎంపికైయ్యారన్నారు. విజేతలైన క్రీడాకారులు ఇద్దరినీ హెచ్ఎం కె.సాయిరాం, ఇన్‌ఛార్జి హెచ్ఎం బిఎస్ఎన్.మూర్తి, స్టాఫ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, పిఇటి సూర్యకుమారి, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

యాత్రికులతో కిటకిటలాడిన జనార్థన స్వామి ఆలయం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీ శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిటకిటలాడింది. ఎంపిడిఒ ఎ.రాజు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ చైర్మన్ రాంబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తానని ఆలయ కమిటీ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు కు హామీ ఇచ్చారు.

కార్టూ'నిజం'



కంపుగొడుతున్న కడియపులంక అటకెక్కిన పారిశుధ్యం నేటికీ బహిరంగ మలవిసర్జన


పలుచోట్ల స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలి పంచారు.

రామచంద్రపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం శీలంవారి సావరం గ్రామంలో పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, కూటమి పార్టీ నాయకులు సలాది నాయుడు మాస్టర్, ఉండవిల్లి శివ, కడియాల రాఘవన్, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, బుంగా రాజు తదితరులు పాల్గొ న్నారు.

ముమ్మిడివరం: స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సిహెచ్.గున్నేపల్లి పంచాయతి పరిధిలో సర్పంచ్ గోలకోటి దొరబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఏ దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఎంపిడిఒ దీక్షితులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **పిగన్నవరం:** ఇంటి పరిసరాలలో ఖాళీ స్థలాలలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ బొండాడ నాగమణి కోరారు. పి.గన్నవరం అంబేద్కర్ కాలనీలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి ఎన్‌వివి.సత్య నారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఆమె మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపి వేసి పరిశుభ్రతకు ప్రాధాన్య ఇవ్వాలని ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎంపిటిసి సభ్యు రాలు పులపర్తి చిన వెంకటలక్ష్మి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మండలంలోని మూలస్థానం అగ్రహారంలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ప్రతి నెల మూడవ శనివారంలో భాగంగా సర్పంచ్ లంక వరప్రసాదరావు ఆధ్వర్యంలో పచ్చదనం - పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే మొక్కలను గ్రామ పరిధిలో నాటారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్.వీరమాత, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి దేవి, సచివాలయం-2 సెక్రటరీ సిహెచ్.హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలం కోరుమిల్లి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత పై శనివారం అవగాహనార్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆచంట సత్య నారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాకతిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మానస, ఎంపిటిసి సుంకర వెంకటే శ్వరరావు, కార్యదర్శి కామేశ్వరరావు, వార్డు సభ్యులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు



పి.గన్నవరం లో మొక్కలు నాటుతున్న సర్పంచ్, కార్యదర్శులు

నేరాలు ఘోరాలు

దొంగల అరెస్టు-సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - శంఖవరం

పలు ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీలు చేస్తున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...వేరువేరు ప్రాంతానికి చెందిన పాలెపు సతీష్, బలసాడి ధనుష్, బన్నికల లక్ష్మణరావు, పంతాడి సత్యసాయి ఒక ముఠాగా ఏర్పడి పలు ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును చోరీ చేసిన సంఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో సంబంధిత దొంగలపై నిఘా పెట్టారు. శనివారం మండలంలోని కత్తిపూడి శివారున కాకినాడ వెళ్ళే వై జంక్షన్ వద్ద నలుగురు దొంగలను తమ సిబ్బంది అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపేట డిఎస్‌పి

ఫ్లెక్సీ యజమానులతో డిఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక డిఎస్‌పి ఆఫీసు నందు కొత్తపేట డిఎస్‌పి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పది మండలాల్లో ఫ్లెక్సీ ఓనర్లు అందరితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ ఎవరు వివాదాస్పదమైన వ్యాఖ్యలు ప్రింట్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రానున్న సినిమాలకు సంబంధించి, దసరాకు సంబంధించి ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించి ఏదైనా అనుచితమైన కంటెంట్ ప్రింట్ చేస్తే వారిని చట్టపరిధిలోకి తీసుకువచ్చి వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు. రెండు కులాలు, మతాలు మధ్యన విద్వేషాలు రెచ్చగొట్టే ఏ విధమైన వ్యాఖ్య గాని, సంకేతం గానీ, సూచన గాని, ఫ్లెక్సీలో కనబడితే ఫ్లెక్సీ షాపు ఓనర్‌ది బాధ్యత అని హెచ్చరిక జారీచేశారు. ఎవరైనా వ్యక్తులు అనుచితమైన, వివాదాస్పదమైన కంటెంట్ ను ప్రచురించమని చెప్పి ఫ్లెక్సీ షాప్ ఓనర్లపై ఒత్తిడి తెస్తే ఆ విషయాన్ని పోలీసులకు తెలియజేయమని చెప్పి వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఎవరైనా సరే ఈ యొక్క ఫ్లెక్సీలు ప్రభుత్వ స్థలాల్లో పెట్టదలుచుకుంటే ముందస్తుగా సంబంధిత శాఖల నుంచి పర్మిషన్ తీసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రావులపాలెం టౌన్ సిఐ శేఖర్ బాబు, పి.గన్నవరం సిఐ భీమరాజు, కొత్తపేట ఎస్సై సురేంద్ర పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

స్థానిక 8వ వార్డు పరిధిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రెయినేజీ పునర్నిర్మాణ పనులను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరిశీలించారు. వర్క్ ఇన్స్పెక్టర్ తాతారావును పనులపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, 8వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి పెందుర్తి ప్రదీప్ కుమార్, ముమ్మిడివరపు నారాయణరావు, జొన్నాడ పాపయ్యమ్మ తదితరులు, పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఇటీవల ప్రయివేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థిక సాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 14 మందికి రూ.13,12,448 మంజూరయ్యింది. ఈ చెక్కులను శనివారం మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, రాష్ట్ర టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.


మండల సమావేశంలో పాల్గొన్న ఎంపిపి భవాని

ప్రజాప్రతినిధులకు లభించని గుర్తింపు

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు కనీస గుర్తింపు లభించడం లేదని అభివృద్ధి పనులకు, పలు ప్రారంభోత్సవాలకు కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని మండల పరిషత్ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ పాటించడం లేదని సభలో అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పలువురు మండల అధికారులు మండల సర్వసభ్య సమావేశాలకు రావడంలేదని గతంలో ఎన్నిసార్లు చెప్పిన తీరు మారడం లేదని ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అక్కల రీశ్వంత్ రాయ్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరాల రాజ్యలక్ష్మి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కూటమిపై పోరుబాట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమిపై పాలనా వైఫల్యాలపై మొదలైన పోరుబాట పతాక స్థాయికి చేరింది. అధికారంలోకి వచ్చి 17 నెలలు గడిచినప్పటికీ సూపర్ సిక్స్ అమలుకే ప్రభుత్వం ఆప సోపాలు తప్పటం లేదు. మరోవైపు నియోజక వర్గాల వారీగా ఇచ్చిన హామీలు అమలు ఊసేలేదు. ఇంకోవైపు ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించటంతో ఆయా వర్గాలన్నీ పోరుబాటకు సిద్ధం అయ్యాయి. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన రణభేరికి ఉపాధ్యాయులు బ్రహ్మరథం పట్టారు. ఈ పర్యటనలో పాల్గొన్న శాసన మండలి సభ్యులకు తమ వినతిపత్రాలను అందజేశారు. విజయవాడలో జరగబోయే ఆందోళనలకు తరలివెళ్తున్నారు. విద్యుత్ ఉద్యోగులు ఇప్పటికే భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. 20వ తేదీన నిరాహార దీక్షల తో పాటు 22న కలెక్టర్ కార్యాలయాలు ఎదుట ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు తమపై పని భారం తగ్గించాలని కోరుతూ ఉన్నతాధికారులకు తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించడంతో పాలక ప్రభుత్వం బుజ్జగింపులకు తెరలేపింది. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థుల పక్షాల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోలనపై పోలీసులు వ్యవరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీసింది. అధికారం చేపట్టి కనీసం 2 సంవత్సరాలు కూడా గడవకముందే కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి విమర్శలకు గురికావటం విశేషం.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై భగ్గు

మెడికల్ కాలేజీల నిర్వహణా బాధ్యతలను పిపిపి విధానంలో అప్పజెబుతామంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయంపై విద్యార్థులు భగ్గుమన్నారు. మరోవైపు ప్రతిపక్ష వైసిపి నేతలు చేపట్టిన ఆందోళనలను పోలీసులు అడ్డుకోవటం విమర్శలకు దారి తీసింది. వైసిపి పాలనలో మెడికల్ కాలేజీకి కేటాయించిన స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మించేందుకు ప్రయత్నం చేయటంపై అప్పటి ప్రతిపక్ష టిడిపి భగ్గుమన్న విషయం విధితమే. అదేవిధంగా సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అమల్లోకి తీసుకురావటంతో 43 శాతం సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున విద్యార్థులు ఫీజులు చెల్లించక తప్పటం లేదు. తాజాగా కూటమి ప్రభుత్వం కారు చౌకగా ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పటం వంటి విధానాలు రెండు పార్టీల వైఫల్యాలను దర్పణం పడుతున్నాయి. తాజాగా ఒకరిపై, మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుని రాజకీయ లబ్ధికోసం ప్రాకులాడుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యా, వైద్యం వంటి కీలక రంగాలను ప్రైయివేటుపరం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆదిశగా పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఢి రైతుల కంట చెమ్మ

తాళ్లపూడి, పంగిడి, గోపాలపురం తదితర మండలాల్లో అనారోగ్యంతో పశువుల మృత్యువాత పడటంతో పాడి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో గత కొన్ని నెలలుగా గేదెల దొంగలు పెచ్చరిల్లుతున్నారు. దొంగల భారి నుంచి తమ పశు సంపదను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న పాడి రైతులకు తాజా ఘటన గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. అధికార యంత్రాంగం ఇప్పటికే క్షేత్రస్థాయి పర్యటించి వివిధ రకాల పరీక్షలను నిర్వహించింది. అయితే థైలీరియాసిస్, ఆంపిస్టోమియాసిస్ లక్షణాలు



కొన్ని పశువులలో కన్పించడంతో ఆ దిశగా చికిత్సను ప్రారంభించారు. దీంతో కొన్ని పశువులు కోలుకుని సాధారణ స్థితికి రావటంతో కొంత ఊరట లభించింది. పశువులను సంరక్షించేందుకు ఉన్నతాధికారులు మరింత చొరవ తీసుకోవాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్ విజయవంతం

రిజిస్ట్రేషన్ శాఖలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలపై దస్తావేజు లేఖర్లు తమ గళం విప్పారు. వారాంతంలో చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమంలో అత్యధిక మంది భాగస్వాములయ్యారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఫలితంగా రెండురోజుల పాటు జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లు స్థంభించాయి. గత ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీసుకొచ్చిన విధానంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మూటగట్టుకున్న విషయం విధితమే. అయితే కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ అవే విధానాలను కొనసాగించటంతో పాటు తాజాగా ఒటిపి, స్థానిక సంస్థల డేటా బేస్‌ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్, కార్డ్‌ప్రైమ్ 2.0 లోని సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించి తమ ఉపాధికి భరోసా కల్పించాలంటూ చేపట్టిన ఆందోళనలకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సైతం మద్దతు తెలపటం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలని ఆయా వర్గాలు కోరుతున్నాయి.


రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌరీ మల్లిక్

రణభేరికి ఉపాధ్యాయులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆలమూరు

యుటిఎఫ్ రణభేరికి గుంటూరు రావలసిందిగా కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నట్లు యుటిఎఫ్ ఆలమూరు సంఘ నాయకులు శనివారం తెలిపారు. ఈ నెల 25న గుంటూరు లో జరిగే యుటిఎఫ్ రణభేరి సదస్సు పోస్టర్ ఆవిష్కరణను కొత్తూరు గవర్నమెంట్ హైస్కూల్ క్లస్టర్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ, అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు వైవివి.రమణ, ప్రధాన కార్యదర్శి బొంతు లోకేష్, గౌరీ మల్లిక్, చంద్రమోహన్, జొన్నాడ మనోజ్ కుమార్, నాగులకొండ శ్రీనివాసరావు, కృష్ణమూర్తి మాచరరావు, వివిధ హైస్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి సమాజానికి, ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మాదక ద్రవ్యాలువాడుతున్నారంటూ ఫిర్యాదులు రావడంపై మంత్రి దృష్టి సారించారు. ఈ మేరకు మంత్రి శనివారం కృత్తివెటి పేర్రాజు పంతులు హైస్కూల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10 మంది విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సుభాష పట్టణంలోని కత్తివెంటి పేర్రాజు పంతులు హైస్కూల్లో నేరుగా 9,10, తరగతి గదిలోనికి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులతోనూ ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు, సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ కుమార్, ఎఎంసి మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, ఎఎంసి ఉపాధ్యక్షుడు కేతా రాంబాబు, నేతలు పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వం సరఫరా చేసిన బోధన ఉపకరణములతో మెరుగైన ఫలితాలు వస్తాయని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎం.మమ్మీ అన్నారు.2 025-26 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ నెలకు నిర్వహించే పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం బండారులంక జడ్‌పిఉన్నత పాఠశాలలో ఆమె సందర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్మన్ బాల, ఇందుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లంక రాణి, సాకూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పోతంశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలను కెనరా బ్యాంకుకు మార్చాలని వినతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పేరవరం గ్రామంలో ఉన్న 103 స్వయం సహాయక సంఘాల డ్వాక్రా మహిళలు తమ బ్యాంకు ఖాతాలు పులిదిండి యూనియన్ బ్యాంకులో ఉన్నాయి. అయితే పేరవరం గ్రామం నుంచి పులిదిండిలో బ్యాంకుకు వెళ్లాలంటే ఎక్కువ దూరం ఉన్నందున ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగారాజవరం గ్రామాల్లో ఉన్న కెనరా బ్యాంకు తమ ఖాతాలను మళ్లించాలని డ్వాక్రా సంఘాల కోరారు. శనివారం పేరవరం గ్రామంలో సమావేశం నిర్వహించుకుని గ్రామ సర్పంచ్ గంటి విజయ భారతి, డిఆర్‌డిఎ మండల వెలుగు అధికారి గంగాధర్ ద్వారా కెనరా బ్యాంక్ రాజవరం బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, చీఫ్ మేనేజర్ జగన్నాథ్‌కుమార్ నాయక్‌కు ఈ విషయాన్ని వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండో దశ అడ్మిషన్ల ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అమలాపురం నందు 2వ దశ డిగ్రీ అడ్మిషన్స్ సోమవారం నుండి ప్రారంభ మవుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.నరసింహ స్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు సం.రాల సాధారణ ఇంటర్మీడియట్, ఒకేషనల్,ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని చుట్టు పక్కల మండలాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలనికోరారు. వివరాలకు: 9491191635, 9490977555, 9441481707, 8074726289, 9915678760లలో సంప్రదించాలన్నారు.


వివిధ వేషధారణలో విద్యార్థులు

ఓరియంటల్ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి పొడగట్లపల్లి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు శేషకుమార్ అధ్యక్షతన ముందస్తు దసరా సంబరాలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తలపించాయి. హెచ్ఎం మాట్లాడుతూ విజయదశమి ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయుడు జి.పద్మనాభం ఆధ్వర్యంలో విద్యార్థులను అమ్మవారి వివిధ రూపాల్లో అలకరించిన ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలు రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. పలువురు విద్యార్థులు ఆయా విభాగాలలో విజేతలుగా నిలిచారు. హెచ్ఎం,జి.కనకదుర్గ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో వివిధ విభాగాల్లో విజయం సాధించారు. వ్యాయామ ఉపాధ్యాయులు గొలకోటి ఫణీంద్ర కుమార్, కామన మధు సూధన రావు దూలం సరస్వతి, స్వాతి,సీతాపతి,, ప్రసాద్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై పలుచోట్ల అవగాహనా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని పలు సూచనలు చేశారు. **అంబాజీపేట**: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళల ఆరోగ్యం పరిరక్షించు కోవడంలో అందరి బాధ్యతగా భావించాలని సర్పంచ్ పితాని మంగాదేవి, వీరస్వామి అన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో నందంపూడిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షతన వహించి ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ కెఎన్.శ్రీనివాస్, కిమ్స్ సర్జన్ ఎం.అరవింద్, పిహెచ్‌సి సిహెచ్ఒ బి.అప్పారావు వివిధ వ్యాధులకు చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్య క్రమంలో 104 సిబ్బంది, పిహెచ్ఎన్ ఎం.భూలక్ష్మి, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. గొల్లవిల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, మాజీ సర్పంచ్ లు అరిగెల నానాజీ, గుత్తాల సుభాష్ చంద్రరావు, సహకార సొసైటీ అధ్యక్షుడు మంచెం బాలకృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నేలపూడి లావణ్య కుమార్ రాజా, కందిబొట్ల శ్రీను అన్నారు. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆలమూరు, నర్శిపూడి గ్రామాల్లో వైద్యాధికారులు ఎన్,లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** వాకతిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కోరుమిల్లి గ్రామం పంచాయతీ వద్ద స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అనధికార లే ఔట్లలల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరించు కోవాలని ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవి వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఔవుట్లల్లో, ప్లాట్లలో ఎటువంటి అనుమతులు పొదకుండ నిర్మించిన ఇళ్ళ ను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ ఆర్ఎస్ (లే అవుట్ రేగ్యులరైజేషన్ స్కీమ్)లో 90 రోజుల పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు.ఈ స్కీమ్ ద్వారా 30 జూన్ 2025కి ముందు ఎవరైనా అనధికార లేఔట్లల్లో ప్లాట్లు, స్థలములు కొనుగోలు చేసినను ఎల్ఆర్ఎస్ వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని, వాటి సంబంధించిన వివిధ ఛార్జీలను చెల్లిందచి సంబంధిత స్థలములు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ స్కీమ్ గడువు అక్టోబర్ 23తో ముగియనున్నందున, త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రభుత్వము ఆవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వినిపించాలని నియోజ కవర్గం వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలపునిచ్చారు. పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద మండల శాఖ అధ్యక్షులు కొమ్మల రాము అధ్యక్షతన శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల అనారోగ్యంతో చిట్టూరి రామకష్ణ మతి చెందారు. రామకృష్ణ మృతికి సమావేశం మౌనం పాటించి సంతాపం తెలిపింది. సమావేశంలో నీతిపూడి గణేష్ బాబు, జక్కంపూడి వాసు, ఎంపిటిసి సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, జోగి రామకృష్ణ, చిక్కం బుజ్జిబాబు, మట్టపర్తి శివ, గెడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

నరసాపురపుపేట గ్రామంలో జరిగిన ఆరోగ్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బివి. సత్యనారాయణ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 533 మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.లక్ష్మీ ప్రసన్న , గ్రామ సర్పంచి చాత్రాది వీరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు పడమటి జ్ఞానలక్ష్మి, గ్రామ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాపారావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు పుట్టినరోజ వేడుకలు శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తన పుట్టిన రోజున అన్నదానం, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు పాపారావు కతజతలు తెలిపారు.

రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ జి.నరేష్ అన్నారు. స్థానిక స్టేషన్ పరిధిలో చొప్పెల్ల, దుళ్ళ రోడ్డులో నంది గుంట వద్ద వాహన తనిఖీలు శనివారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. హెల్మెట్ లేకుండా, మత్తులో వాహనం నడపడం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.